

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 23-07-2025 | సంపుటి - 24 | సంచిక - 78 రూ : 4 | పేజీలు : 8




## తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరో..?

# రేసులో నీతీశ్, శశిథరూర్..!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆయన వైదొలగడంతో ఇప్పుడు తదుపరి ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈక్రమంలోనే తెర పైకి పలువురి పేర్లు వచ్చాయి. అందులో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పేరు కూడా ఉండటం గమనార్హం.

**బిహార్ ఎన్నికల వేళ..**

మరికొన్ని నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రానికి కొన్నేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నీతీశ్ కుమార్ ఇకనైనా ఆ కుర్చీని వీడి కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని ఎన్డీయే కూటమిలో పలువురు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో

**తరువాయి 2లో**

## ఉచిత ప్రయాణాలు..

# 200 కోట్లు..

### 'మహాలక్ష్మి' పథకం సరికొత్త రికార్డు

- ఆర్టీసీ జీరో టికెట్ల జారీలో కీలక మైలురాయి

ఆడబిడ్డలకు అభినందనలు.. సీఎం రేవంత్‌రెడ్డి

మహిళలకు రూ.6,671 కోట్ల ఆదా: మంత్రి పొన్నం

**2లో**



## పక్షిలా ఎగురుతున్నా..

# అవంటే భయమే...

- లోహ విహంగాలకు పక్షుల గండం
- ప్రధాన విమానాశ్రయాల్లో పెరుగుతున్న ఘటనలు



హైదరాబాద్: విమాన రాకపోకలకు సాంకేతిక ఇబ్బందులే కాదు పక్షులు కూడా ఆటంకంగా మారుతున్నాయి. ప్రధానంగా మెట్రో నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో అవి విమానాలను ఢీకొడుతున్నాయి. గతనెల 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం అనంతరం పౌరవిమానయాన శాఖ ఉన్నతాధికారులు భద్రతపై సమీక్ష నిర్వహించగా.. దేశంలోని 20 విమానాశ్రయాల్లో ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకు పక్షులు, జంతువులు ఢీకొట్టిన కారణంగా 641 విమానాల రాకపోకలకు అంతరాయం కలిగిందని తేలింది. దిల్లీలో పక్షులు ఢీకొనడంతో అత్యధికంగా 95 సార్లు వేర్వేరు గమ్యస్థానాలకు వెళ్లాల్సిన విమానాలు ఇబ్బందులు

**తరువాయి 2లో**



**2లో**

## యూరియా కొరతపై

## కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరా నడ్డా

- ఆయన్ను అవిశ్రాంత పోరాటయోధుడిగా అభివర్ణించిన కాంగ్రెస్

హైదరాబాద్: భాజపా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డాను దిల్లీలోని ఆయన నివాసంలో మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావులు కలిశారు. ఈ సందర్భంగా కేంద్రం సరిపడా యూరియా సరఫరా చేస్తున్నా రాష్ట్రంలో కొరతకు కారణం ఏంటని జేపీ నడ్డా ఆరా తీయగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ఏడాది యూరియా కొరత ఏర్పడిందని

**తరువాయి 2లో**

### టెట్ ఉత్తీర్ణులు

# 59,692 మంది

- పేపర్-1లో 61.5శాతం.. పేపర్-2లో 33.9 శాతం పాస్
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ

హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)2025 తొలి విడతలో రెండు పేపర్లు కలిపి 59,692 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డా.నవీన్ నికోలస్ మంగళవారం సచివాలయంలో ఫలితాలను విడుదల

**తరువాయి 2లో**




# పట్టణీకరణతో ముంపు ముప్పు



- ప్రమాదం బారిన దేశంలోని మూడొంతుల జనాభా
- హైదరాబాద్, బెంగళూరులపైనా తీవ్ర ప్రభావం
- ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడి

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా అనూహ్యంగా పెరిగిపోతున్న పట్టణీకరణ దేశానికి అనేక అనర్థాలు తెచ్చిపెట్టబోతోందని ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'గ్లోబల్ ఫెసిలిటీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ అండ్ రికవరీ' సంస్థ హెచ్చరించింది. దీని ప్రభావం మన దేశంపైనా తీవ్రంగా ఉండబోతోందని, పెద్ద నదీ తీరాలకు దూరంగా ఉండి, ఇప్పటివరకు వరద ముప్పు ఎదుర్కొనని హైదరాబాద్ వంటి నగరాలు కూడా ముమ్ముందు వరదల బారినపడే ప్రమాదం ఉందని స్పష్టంచేసింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహకారంతో ఈ సంస్థ పట్టణాల్లో జనాభా పెరుగుదల, తదనుగుణంగా తలెత్తనున్న సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి... ''సుసంపన్న, సుస్థిర నగరాల దిశగా'' పేరిట ఇటీవల నివేదిక విడుదల చేసింది. పట్టణీకరణతో తలెత్తనున్న విపత్తుల గురించి అందులో సవివరంగా పేర్కొంది.

**ఆరు అతి పెద్ద సమస్యలు**

పట్టణీకరణతో భారత నగరాలకు ఎదురయ్యే ఆరు అతి పెద్ద సమస్యలను ప్రపంచ బ్యాంకు తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. ''ఉష్ణోగ్రత పెరుగుదల, వాతావరణంలో అనూహ్య మార్పులు, తద్వారా ముంచుకొచ్చే వరదలు, తాగునీటి కొరత, అపారిశుద్ధ్యం, ప్రజా రవాణాలో సంక్లిష్టత... అనే సమస్యలు పట్టణాలను అధికంగా ప్రభావితం చేయనున్నాయి. దేశ మొత్తం జనాభాలో మూడోవంతు మంది

**తరువాయి 2లో**

- ఆగస్టు 20లోగా బర్లీ పొగాకు కొనుగోలు పూర్తిచేయాలి
- ఆగస్టు 15లోగా మామిడి రైతులకు చెల్లింపులు చేయాలి
- అపార్ట్‌మెంట్ల ముంగిటకే మొబైల్ రైతుబజార్లు
- వ్యవసాయ, అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు

# కాలువలకు నీటిని విడుదల చేయండి



అమరావతి: రాష్ట్రంలోని అన్ని కాలువల ద్వారా సాగు అవసరాలకు నీటిని విడుదల చేయాలని.. చివరి ఆయకట్టు వరకూ అందేలా చూడాలని జలవనరులశాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నాగార్జునసాగర్ కుడికాలువకు నీటిని విడుదల చేయండి. కాలువల్లో పూడిక తీయించి ప్రవాహాలకు అంతరాయం లేకుండా చూడాలి. సాగునీటి సంఘాల ప్రతినిధులతో వర్చువల్ సమావేశాలు నిర్వహిస్తాం' అని చెప్పారు. వ్యవసాయ అధికారులు, సిబ్బందికి సీజన్‌లో.. వ్యవసాయేతర పనులు అప్పగించవద్దని కలెక్టర్లకు సీఎం స్పష్టం చేశారు. 'ఆగస్టు 20లోగా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు పూర్తిచేయాలి. ఆగస్టు 15లోగా మామిడి రైతులకు చెల్లింపులు చేయాలి. రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయని కంపెనీలపై కఠినచర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై మంగళవారం సాయంత్రం సచివాలయంలో సుమారు 4 గంటలకు పైగా సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కవర్లు కట్టి పండించిన మామిడి పండ్లను చంద్రబాబు పరిశీలించారు. 'అన్నదాతా సుఖీభవ పథకంలో 47.42 లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తయింది. ప్రతి రైతుకూ ఈ పథకం ద్వారా సాయం అందేలా చూడాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

*** సాగు సంగతి**

**తరువాయి 2లో**

# పట్టణీకరణతో ముంపు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

వీటి బారినపడే ప్రమాదముంది. గతంలో వరద ముంపు ప్రమాదం ఎదుర్కొనని హైదరాబాద్, బెంగళూరు, ఇండోర్ వంటి నగరాలకూ ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కావాలి. ప్రజా రవాణా, తాగునీరు, మురుగునీటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన మెరుగుపరచాలి. వరదలను తట్టుకునేందుకు డ్రెయిన్ల సామర్థ్యం పెంచాలి. వర్షపు నీటిని పీల్చుకునేలా బహిరంగ ప్రదేశాలను సిద్ధం చేయాల్సి అవసరం ఉంటుంది'' అని నివేదికలో సూచించింది. అందులోని మరిన్ని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి... ప్రస్తుతం భారత్‌లో 4,041 మధ్యస్థాయి, పెద్ద నగరాలు ఉన్నాయి. గత అరవై ఏళ్లలో పట్టణ జనాభా ఆరు రెట్లు పెరిగింది. ప్రస్తుతం దేశ జనాభాలో మూడోవంతు పట్టణాల్లోనే ఉంటోంది. పెరుగుతున్న జనాభా కోసం 2070 నాటికి 14.4 కోట్ల ఇళ్ల అవసరం ఉంటుంది. ప్రస్తుతం భారత్‌లోని పట్టణ జనాభాలో సగం మంది ఇనుప రేకులు వంటి ప్రమాదకరమైన, వేడిని త్వరగా గ్రహించే సామగ్రితో నిర్మించిన ఇళ్లలో ఉంటున్నారు.

2035 నాటికి దేశంలోని పట్టణ ప్రాంతాలు 28.5 కోట్ల టన్నుల ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేయనున్నాయి. అవి 2050 సంవత్సరం నాటికి 41.5 కోట్ల టన్నులకు చేరుకుంటాయి.

# టెట్ ఉత్తీర్ణులు 59,692 మంది

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. జూన్ 1830 మధ్య ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 1.83 లక్షల మంది దరఖాస్తు చేసినా 1,37,429 మంది అభ్యర్థులే హాజరయ్యారు. 43.43 శాతం మంది కనీస మార్కులు సాధించి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు పోటీ పడేందుకు అర్హత సాధించారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ) ఉద్యోగాలకు అర్హత పొందేందుకు పేపర్ 1, ఉన్నత పాఠశాలల్లో(610 తరగతులు) బోధనకు పేపర్2 పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఒకసారి పాసైతే ఆ స్కోర్‌కు జీవితకాలం గుర్తింపు ఉంటుంది. టెట్‌లో వచ్చిన మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు. అందుకే మార్కులు పెంచుకునేందుకు అభ్యర్థులు మళ్లీ మళ్లీ పరీక్ష రాస్తున్నారు. ఫలితాల విడుదలలో ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకుడు రమేశ్, ఎస్‌సీఈఆర్‌టీ ఆచార్యురాలు రేవతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2024 నుంచి ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తోంది. మళ్లీ నవంబరు/డిసెంబరులో జరగాల్సి ఉంది.

# కాలువలకు నీటిని విడుదల చేయండి

(మొదటిపేజీ తరువాయి)

**తెలుసుకునేందుకు ఉపగ్రహ సర్వే**

ఏ సర్వే నంబర్లో ఏ పంట సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు ఉపగ్రహ సర్వే విధానం అనుసరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఉపగ్రహ సర్వే ద్వారా సమగ్ర సమాచారం అందిందని చెప్పారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతు సేవాకేంద్రాల నిర్వాహకుల ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలని చంద్రబాబు చెప్పారు. చంద్రబాబు సమీక్షలోని ముఖ్యాంశాలు..

* ఆక్వా రంగంలో దాణాగా చికెన్ వ్యర్థాలను ఉపయోగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. అలాంటివారికి రాయితీ విద్యుత్తు నిలిపివేసే అంశాన్ని పరిశీలించాలి.
* పంటల సాగులో నాణ్యతకు పెద్దపీట వేయాలి. అంతర్జాతీయ ఎగుమతులకు వీలుగా మన ఉత్పత్తులు ఉండాలి.
* ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు త్వరలో టాటాతో ఒప్పందం చేసుకోవాలి. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా జపాన్, తైవాన్ తదితర దేశాలకు ఉత్పత్తుల్ని ఎగుమతి చేయాలి.
* మొబైల్ రైతుబజార్లను అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాల వద్దకు పంపేలా 30 రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయండి.
* వర్షాలను బట్టి ముందే పంటలు వేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలి. దీంతో తుపానులు, భారీవర్షాల కారణంగా పంటనష్టాన్ని నివారించవచ్చు.
* మత్స్య సంపద ఎక్కువగా ఎక్కడ దొరుకుతుందో మత్స్యకారులకు యాప్ ద్వారా తెలియజేయాలి.

# తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరో..? రేసులో నీతీశ్, శశిథరూర్..!

(మొదటిపేజీ తరువాయి)

జేడీయూ కూడా ఎన్డీయే కూటమితో కలిసే బరిలోకి దిగనుంది. దీంతో నీతీశ్‌ను తప్పించి మరో నాయకుడికి రాష్ట్ర పగ్గాలు అప్పగించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే జగదీప్ ధన్‌ఖడ్ స్థానంలో బిహార్ ముఖ్యమంత్రికి ఉప రాష్ట్రపతి పదవి కల్పించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే.. బిహార్‌లో ముఖ్యమంత్రి పదవి భాజపాకు దక్కనున్నట్లు సమాచారం. జేడీయూకు ఉప ముఖ్యమంత్రి పదవిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. నీతీశ్ కుమార్ కుమారుడు నిషాంత్ డిప్యూటీ సీఎం అయ్యే అవకాశాలున్నాయి.

**సాధ్యమైనంత త్వరలోనే ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఎన్డీయే విజయం సునాయాసమే**

**శశిథరూర్‌ను తీసుకొస్తారా..?**

కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్‌కు క్రమంగా దూరమవుతున్నారు సీనియర్ ఎంపీ శశిథరూర్ (Shashi Tharoor). త్వరలోనే ఆయన హస్తానికి గుడ్‌బై చెప్పి భాజపాలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం నియమించిన ఎంపీల కమిటీలో ఒకదానికి థరూర్ నేతృత్వం వహించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే తాజా రేసులో థరూర్ పేరు తెర పైకి వచ్చింది. ఆయనకు ఉప రాష్ట్రపతి పదవి ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**లెఫ్టినెంట్ గవర్నర్లకూ ఛాన్స్..**

నీతీశ్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు కూడా ఉప రాష్ట్రపతి పదవి రేసులో వినిపిస్తోంది. దిల్లీ, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్లలో ఒకరికి అవకాశం ఇవ్వనున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గత మూడేళ్లుగా దిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ హయాంలో ఉన్న సమయంలో.. నియామకాల నుంచి వివాదాల వరకు నాటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో విభేదించి తరచూ వార్తల్లో నిలిచారు. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి ఎల్జీతో వివాదం కూడా ఓ కారణమైంది. దీంతో ఆయన కేంద్రం దృష్టిలో పడ్డారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి సక్సేనా వైపు మొగ్గు చూపే అవకాశాలు కన్పిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీతో ముగియనుంది. భాజపా సీనియర్ నేత అయిన సిన్హా గతంలో ఆ పార్టీ జాతీయ కౌన్సిల్‌లో సభ్యుడిగా వ్యవహరించారు. మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర సహాయమంత్రిగా కూడా సేవలందించారు. ఆర్టికల్ 370 రద్దు అయిన ఏడాది తర్వాత జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సిన్హా.. ఈ కేంద్రపాలిత ప్రాంతం పాలనలో తనదైన ముద్ర వేశారు. విమర్శలు, వివాదాలతో అనేక సార్లు వార్తల్లో నిలిచారు.

# యూరియా కొరతపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరా

(మొదటిపేజీ తరువాయి)

వారు వివరించినట్లు సమాచారం. కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కిషన్‌రెడ్డికి సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని రామచందర్‌రావుకు నడ్డా దిశానిర్దేశం చేశారు. అనంతరం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీలను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, జాతీయ సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్‌లతోనూ రామచందర్‌రావు సమావేశమయ్యారు.

# ఉచిత ప్రయాణాలు... 200 కోట్లు

హైదరాబాద్: మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకానికి భారీ ఆదరణ లభిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళలకు భద్రతను, ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తోంది. జులై 22 (మంగళవారం) నాటికి రాష్ట్రవ్యాప్తంగా 199.71 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసింది. బుధవారం ఈ సంఖ్య 200 కోట్లకు చేరుకుంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ పథకంతో ఆర్టీసీ తీరు మారింది. గతంలో బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి (ఓఆర్) 67 శాతం ఉండేది. ఆర్టీసీకి ప్రతినెలా భారీ నష్టాలు వచ్చేవి. ప్రయాణికుల కోసం డ్రైవర్, కండక్టర్లు ఎదురుచూసేవారు. మహాలక్ష్మి పథకం అమలుతో సగటు ఓఆర్ 95 శాతానికి పెరిగింది. జీరో టికెట్లు.. రీయింబర్స్‌మెంట్: మహిళలకు ఆర్టీసీ 'జీరో' టికెట్లను జారీ చేస్తోంది. టికెట్ల ఛార్జీల్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. నెలకు రూ.358.79 కోట్ల చొప్పున 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.4,305.49 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది.

# పక్షిలా ఎగురుతున్నా.. అవంటే భయమే

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొన్నాయి. ఈనేపథ్యంలో అత్యాధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యను అధిగమించాలని పౌరవిమానయాన డైరెక్టర్ జనరల్ కార్యాలయం మెట్రో, ఇతర నగరాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఆహారం కోసం రన్‌వే పైకి..**

విమానాశ్రయాల్లో వాయు, ఇతర కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో విమానాశ్రయ అధికారులు జలవనరులు, మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఎయిర్‌పోర్టుల్లో పక్షులు రాకుండా ఉండేందుకు నిర్వాహకులు ప్రత్యేకమైన మొక్కలు, పూలను పెంచుతున్నారు. మొక్కలు పెద్దవయ్యాకే దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల్లో పక్షుల రాకపోకలు పెరుగుతున్నాయి. ఇవన్నీ ఆహారం కోసం విమానాశ్రయం రన్‌వేలపైకి వస్తున్నాయి. విమానాలను ఢీకొడుతున్న పావురాలు, పిచ్చుకలు, గబ్బిలాలను చెదరగొట్టేందుకు దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల్లో విమానాలు టేకాఫ్ అయ్యే ముందు భారీ శబ్దాలను చేస్తున్నారు. వాటిని గుర్తించేందుకు అత్యాధునిక బైనాక్యులర్లను ఏర్పాటు చేశారు. ఇంకా బ్యాక్‌లైట్ ట్రాప్ పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. గబ్బిలాలను గుర్తించే పరికరాలనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటన్నింటినీ ప్రయోగిస్తున్నా పక్షుల దాడులు ఆగడం లేదు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఆదివారం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానం ల్యాండింగ్ అయ్యే సమయంలో ఓ పక్షి ఢీకొంది. పైలట్ అప్రమత్తమై సురక్షితంగా రన్‌వేపై దించారు.

# 11వేల యూట్యూబ్ ఛానళ్లపై గూగుల్ వేటు.. రష్యా, చైనావే అధికం!

* **అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయంటూ 11 వేల యూట్యూబ్ ఛానళ్లపై గూగుల్ వేటు**
* **వేటు పడిన వాటిలో ఒక్క చైనాకు చెందినవే 7,700 ఛానళ్లు**
* **భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నట్లు గుర్తింపు**
* **రష్యాకు చెందిన 2 వేలకు పైగా యూట్యూబ్ ఛానళ్ల తొలగింపు**




అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయనే కారణంతో వివిధ దేశాలకు చెందిన సుమారు 11 వేల యూట్యూబ్ ఛానళ్లను తాజాగా గూగుల్ తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్లు అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. ఇలా వేటు పడిన వాటిలో ఒక్క చైనాకు చెందినవే 7,700 ఉన్నట్లు గూగుల్ పేర్కొంది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నట్లు గుర్తించింది. ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ కంటెంట్‌ను పోస్టు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే రష్యాకు చెందిన 2 వేలకు పైగా యూట్యూబ్ ఛానళ్లను తొలగించినట్లు వెల్లడించింది. నాటో, ఉక్రెయిన్‌లను విమర్శిస్తూ రష్యాకు మద్దతుగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని గూగుల్ పేర్కొంది. అంతేగాక రష్యాలోని పలు సంస్థలకు సైతం ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. చైనా, రష్యాతో పాటు ఇజ్రాయెల్, తుర్కియే, ఇరాన్, ఘనా, అజర్‌బైజాన్, రొమేనియాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు వెల్లడించింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, శాంతి భద్రతాలకు విఘాతం కలిగించేలా నిరాధార వార్తలు, కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నందున చర్యలు తీసుకున్నట్లు గూగుల్ స్పష్టం చేసింది.

## ఉపరాష్ట్రపతి 'అనూహ్య రాజీనామా'పై

# కేంద్రం క్లారిటీ ఇవ్వాలి: ఆప్ డిమాండ్

దిల్లీ: ఇంకా దాదాపు రెండేళ్లకు పైగా పదవీ కాలం ఉండగానే ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడం దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. అనారోగ్య కారణాలతోనే తాను రాజీనామా చేసినట్లుగా ఆయన పేర్కొన్నప్పటికీ విపక్షాలు మాత్రం పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉపరాష్ట్రపతి అకస్మాత్తుగా రాజీనామా చేయడంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆప్ డిమాండ్ చేసింది. ఇది చాలా తీవ్రమైన అంశంగా పేర్కొంది. ఈ మేరకు ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ మౌనం, ప్రధాని



నరేంద్ర మోదీ ఆలస్యంగా స్పందించడంపై పలు సందేహాలు లేవనెత్తారు. ''రాజీనామా చేసిన తర్వాత చాలా సేపటికి ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టడం అంతా చూశాం. ఈ జాప్యం ధన్‌ఖడ్ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఒప్పించే ప్రయత్నం జరగలేదని సూచిస్తోంది. ఇంత ఉన్నతమైన రాజ్యాంగ పదవి నుంచి అకస్మాత్తుగా వైదొలగడం సమాధానం లేని ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతోంది'' అని సంజయ్ సింగ్ అన్నారు. వైద్య పరమైన కారణాలను పేర్కొంటూ ధన్‌ఖడ్ తన ఉప రాష్ట్రపతి పదవికి సోమవారం రాత్రి రాజీనామా చేయడంపై అనేక ఊహాగానాలు చెలరేగుతున్న విషయం తెలిసిందే.

# డెలివరీ బాయ్ అత్యాచారం చేశాడంటూ కట్టు కథలు.. టెకీపై కేసు

తనపై ఓ డెలివరీ బాయ్ అత్యాచారం చేశాడంటూ ఓ టెకీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే, అది కట్టుకథ అని తేలడంతో పోలీసులు ఆమె పైనే కేసు నమోదుచేశారు. అసలేం జరిగిందంటే.. పుణెకు చెందిన ఓ టెకీ (22) ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఓ వ్యక్తి డెలివరీ ఏజెంట్‌గా నటిస్తూ తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. దొంగతనంగా తన ఫ్లాట్‌లోకి వచ్చి అత్యాచారం చేసి, ఆ తర్వాత స్పృహ కోల్పోయేలా చేశాడని పేర్కొంది. ఆ వ్యక్తి తన ఫొటోలు తీసి.. విషయం బయటకు చెప్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరిస్తూ మెసేజ్‌లు చేసినట్లు తెలిపింది. దీనికి సంబంధించి పలు సాక్ష్యాలను కూడా ఆమె సమర్పించింది. ఇక, దీనిపై విచారణ జరుపగా.. అసలు విషయం తెలుసుకొని పోలీసులు అవాక్కయ్యారు. డెలివరీ ఏజెంట్‌గా వచ్చిన ఆ వ్యక్తి టెకీ స్నేహితుడేనని గుర్తించారు. ఆమెపై ఎలాంటి అత్యాచారం జరగలేదని, కావాలనే పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ఆ మహిళ తప్పుడు కేసు బనాయించిందని తేల్చారు. దీంతో తిరిగి ఆమె పైనే పోలీసులు కేసు



నమోదు చేశారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

# నితీశ్ కుమార్‌ను తప్పించడానికే ధన్‌ఖడ్ రాజీనామా: ఆర్జేడీ

* **సొంత పార్టీ నేతను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని వ్యాఖ్య**
* **అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రణాళికతో ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందన్న ఆర్జేడీ**
* **ఆర్జేడీ ఆరోపణలను ఖండించిన బీహార్ ఎన్డీయే నాయకులు**

బీహార్‌లో నితీశ్ కుమార్‌ను తప్పించి సొంత పార్టీ నేతను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని, అందుకే జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందని ఆర్జేడీ ఆరోపించింది. ఉపరాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ రాజీనామాపై విపక్షాలు భిన్నంగా స్పందిస్తున్నాయి. నితీశ్ కుమార్‌ను అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే మార్చడానికి వీలుగా ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించారని ఆర్జేడీ చీఫ్ విప్ అక్తారుల్ ఇస్లాం షాహిన్ అన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయం కావడంతో వారిలో నిరాశ పెరిగిపోయిందని అన్నారు. చాలా కాలం క్రితం ఒక సీనియర్ బీజేపీ నాయకుడు నితీశ్‌ను తప్పించేందుకు మద్దతు పలికారని గుర్తు చేశారు. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే మరో అడుగు ముందుకేసి నితీశ్ కుమార్‌ను ఉపప్రధాని చేయాలని సూచించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖడ్ రాజీనామాలో బీజేపీ కుట్ర ఉందని తేలిందని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్‌కు ఉప రాష్ట్రపతి వంటి అప్రధాన్య పోస్టు ఇచ్చి తప్పించాలని చూస్తోందని ఆరోపించారు.

అయితే, ఈ ఆరోపణలను బీహార్ రాష్ట్ర మంత్రి శ్రవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీశ్ కుమార్ బీహార్‌ను వీడబోరని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిని విజయబాటలో నడిపించి బీహార్ ప్రజలకు సేవ చేస్తారని అన్నారు. నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి : డా" కాసం వెంకటేశ్వర్లు

యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సన్నిధి హోటల్ లో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్టం లో త్వరలో జరగన్నున స్థానిక సంస్థల ఎన్నికల లో మన జిల్లా లో అధిక స్థానాలు విజయకేతనం ఎగరవేయాలి అని అన్నారు. స్థానిక సమస్యలపై ఉద్యమబాట పట్టాలని మండల పరిధిలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై నిరసన నిర్వహించాలని, జిల్లా లో అన్ని స్థానిక ఎన్నికలలో విజయం సాధించాలి అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్నికల సంస్థలు జిల్లా ప్రభారీ చడా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల విజయం సాధించే విధంగా ప్రతీ మండల కేంద్రంలో వర్క్ షాప్ నిర్ణహించాలి రాష్ట్ర పార్టీ ఇచ్చే కార్యక్రమాలతో ప్రజలలోకి వెళ్ళాలి అన్ని స్థానికంగా మనం బలపడితేనే పార్టీ ముందుకు పోతుంది అని పార్టీ విజయం కోసం ప్రతీ కార్యకర్త ఒక సైనికులు గా చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా స్థానిక సంస్థల ఎన్నిక జిల్లా కన్వీనర్ పాశం భాస్కర్, జిల్లా కార్యదర్శి కాదురి అచ్చయ్య , యాదగిరి



గుట్ట పట్టణ, మండల అధ్యక్షులు కర్రె ప్రవీణ్, గుంటిపల్లి మహేశ్వరి, సత్యన్నారాయణ, రాష్ట్ర జిల్లా నాయకులు రచ్చ శ్రీనివాస్, వేముల అశోక్ , పడమటి జగన్మోహన్ రెడ్డి,చందా మహేందర్ గుప్తా, చందుపట్ల వెంకటేశ్వర రావు, బోయపల్లి గోపాల్ రెడ్డి, జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, పన్నల చంద్రశేఖర్ రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, యటపెంటయ్య సోమనర్సయ్య ,ఇంద్ర రెడ్డి, డి ఎల్ ఎన్ గౌడ్, పక్కిర్ రాజేందర్ రెడ్డి, కిషన్ నాయక్, పట్నం కపిల్, బుగ్గ దేవేందర్ , మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు మాజి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేలుడు పదార్థాలు అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేసిన కఠిన చర్యలు

- **ముగ్గురిపై కేసు నమోదు, జిలిటన్ స్టిక్స్, కోర్డెక్స్ వైర్, రిటర్నేటర్ల స్వాధీనం**
- **అరెస్టు వివరాలను వెల్లడించిన ముస్తాబాద్ ఎస్సై గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్సై గణేష్ హెచ్చరించారు. పేలుడు పదార్థాలపై జిల్లా టాస్క్ ఫోర్స్, ముస్తాబాద్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిజామాబాద్ కు చెందిన గడిపర్తి శ్రీనివాసరావు, ఓర్సు సాయి మల్లు, ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి రాజు అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఐడియల్ పవర్ జిల్లెట్ స్టిక్స్ 2600, ఐడియల్ బూస్టర్ జిలెటిన్ స్టిక్స్ 405, 6000 మీటర్ల కోర్డెక్స్ వైర్, 175 డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా నందిపేట గ్రామానికి చెందిన గడిపర్తి శ్రీనివాసరావు తన యాజమాని ఓర్సు సాయి మల్లు ఆదేశాలతో ఈ నెల 21న తన టాటా ఏసీ వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను తీసుకొచ్చి నానాపూర్ గ్రామంలోని శివరాత్రి రాజు అనే వ్యక్తికి బండ పనుల నిమిత్తం అమ్ముతుండగా నమ్మదగిత సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ నటేష్ ఆధ్వర్యంలో దాడులు చేసి పేలుడు పదార్థాలను, టాటా యోధ వాహనం టిఎస్ 16 యు సి 272 ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరు కూడా జనావాస ప్రాంతాల్లో జిలిటన్ స్టిక్స్, పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన శివకుమార్ గౌడ్

- **లక్ష రూపాయల చెక్కు అందజేత**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మాజీ మంత్రి బిఅర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ ను కాప్రా సర్కిల్ బిఅర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాండాల శివకుమార్ గౌడ్ మంగళవారం నందినగర్లోని ఆయన నివాసంలో మార్యద పూర్వకంగా కలిశారు. గిఫ్ట్ ఏ స్మయిల్ కార్యక్రమంలో భాగంగా లక్ష రూపాయల చెక్కును కెటిఅర్ కు అందజేశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాపాడటంతో పాటు అన్ని కార్యక్రమాల్లో చురుగ్గ పాల్గొంటున్న శివకుమార్ గౌడ్ కు రానున్న రోజులలో నముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో నాగరం మున్సిపల్ బిఆర్ఎస్ నాయకులు గూడురు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో.. ప్రజలందరికీ సముచిత న్యాయం

- **పెద్ద కొండూరులో నూతన రేషన్ కార్డుల పంపిణీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజా ప్రభుత్వంలో.. ప్రజలందరికీ సమచిత న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డిలు అన్నారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో నూతనంగా వచ్చిన రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ కార్డులకు నోచుకోని ప్రజలకు, ప్రభుత్వం రాగానే రేషన్ కార్డులు ఇచ్చి ఎన్నికల హామీని నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం పాండు రెడ్డి, గూడూరు బాలవర్ధన్ రెడ్డి, కందాటి వెంకటరెడ్డి, గూడూరు నవీన్ రెడ్డి, పొలబోయిన ఐలయ్య, గూడూరు భాస్కర్ రెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- **ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను వెంటనే చెల్లించాలి**
- **సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన మంగళవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గులు పోసే కాడ, బునియాది, గోడలు పూర్తి చేసే కాడ ఉన్న తొందర బిల్లులు చెల్లించే కాడ మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. నాలుగు స్లాబుల ప్రకారం రావలసిన బిల్లులు రాకపోవడంతో ప్రభుత్వంపై అపనమ్మకం ఏర్పడుతుందన్నారు. రెండో దశలో ఎంపిక చేయాల్సిన ఇండ్లను వెంటనే ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి వారికి అన్ని బిల్లులు చెల్లించి, వీరికి మాత్రం ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకుంటున్న పేదలకు సకాలంలో బిల్లులు రాక అప్పుల పాలవుతున్నారని వెంటనే బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోతే లబ్ధిదారులతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గం సభ్యులు చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, బొజ్జ బాలయ్య, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధు కృష్ణ, బోదాస్ వెంకటేష్, జక్కిడి దేవేందర్ రెడ్డి, మీసాల శీను, ఎలమంచిలి సంజీవ, కొంతం సుశీల, రోడ్డ సోని, చెరుకు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమమే ప్రధమ లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సంక్షేమమే ప్రధమ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని, అది చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో, బయట అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. గత పదేళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కూడా మహిళా ఆర్థికంగా వృద్ధి చెందితే ఇల్లు వృద్ధి చెందుతుందని, అలాగే గ్రామం వృద్ధి చెందుతుందనే నానుడితో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని, వడ్డీ లేని రుణాలను అందించిందని, అలాగే మహిళలకు పెట్రోల్ బంకులు, రైస్ మిల్లను కూడా ఇస్తుందని, త్వరలోనే ముస్తాబాద్ మండల కేంద్రంలో మహిళా సంఘాలకు ఒక రైస్ మిల్ను కూడా ఇవ్వనున్నారని అన్నారు. కలెక్టర్ మహిళలకు ఈ జిల్లాలో అన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలను అప్పగిస్తే కొందరు అది చూసి ఓర్వలేక అవహేళన చేశారని, కానీ మహిళా మణులు అవేమీ పట్టించుకోకుండా ఆఖరి గింజ వరకు ఏ ఆటంకం లేకుండా వడ్ల కొనుగోలు పూర్తి చేసి సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే అందరూ మెచ్చుకునేలా చేశారని అన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని అసమర్థ పాలన సాగించిందని, కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలోనే రేషన్ కార్డుల అప్లికేషన్ను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ దాదాపు 5 లక్షల పైచిలుకు రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. మహిళలందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలబడ్డారని, వీధి కుక్కలు ఎన్ని మొరిగిన ప్రజా ప్రభుత్వాన్ని మరో 10 ఏళ్ల పాటు ఆశీర్వదించే బాధ్యత మా ఆడబిడ్డలు తీసుకున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుముల రామ్ రెడ్డి, కాంగ్రెస్ గూడూరు గ్రామ శాఖ అధ్యక్షుడు చాకలి బాబు, మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిపిఐ 27వ పట్టణ మహాసభలు జయప్రదం చేయండి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 27వ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ ఏటీసీ నాయకులు కంచర్ల జమలయ్య, గెద్దాడి నగేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పోస్ట్ ఆఫీస్ ఎంజీ రోడ్డు హమాలి అడ్డాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి, వారు మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో ని పద్మశాలి భవన్లో జరిగే సిపిఐ పట్టణ మహాసభకు అన్ని వర్గాల ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్మిక కర్షక ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ సాగిస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు చేతన ఇవ్వాలన్నారు. ప్రజా ఉద్యమాలకు చేయూతనిస్తూ పట్టణాల్లో జరిగే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా




కార్యదర్శి షాబీర్ పాషా, తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సిపిఐ నాయకులు పిడుగు శ్రీనివాస్, హమాలి సంఘం నాయకులు విజయ రావు, కృష్ణ, ఉప్పలయ్య రవీందర్ ,సాయిబు, కళ్యాణ్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జిఎంపిఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభ



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జిఎంపిఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభకు మంగళవారం మల్లాపురం గొర్రెల మేకల పెంపక దారుల సంఘం సభ్యులు హాజరైనారు ఈ కార్యక్రమంలో మల్లపురం జిఎంపిఎస్ పక్షాన జిల్లా మహా సభలో మా డిమాండ్ వినిపించాము. అన్ని కుల సంఘాలలాగే మా గొర్రెల కాపరులకు గుర్తింపు కార్డు ఇవ్వాలి గత ప్రభుత్వం లాగే సొసైటీ ఎన్నికలు జరిపించి ముఖ్యమంత్రి నుంచి పశు సంరక్షణ శాఖ ను బదిలీ చేశారు తప్ప నిధులు కేటాయించలేదు ప్రస్తుత ప్రభుత్వం వాటిపై సమీక్ష నిర్వహించి త్వరగా నిధులు కేటాయించాలని మా గొర్రెల కాపరులను ఆదుకోవాలని మహాసభలో డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిఎంపిఎస్ సభ్యులు కర్రె చంద్రశేఖర్, మోటె శేఖర్, కర్రే మధు, పండు, కడెం శ్రీధర్, కర్రె లింగస్వామి కర్రె భూషల స్వామి తదితరులు గ్రామం నుంచి పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మండలానికి త్రాగు, సాగు నీరందించాలి

- **ఎమ్మెల్సీ నెలికంటి సత్యం**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి, చౌటుప్పల్ మండల ప్రజలకు త్రాగు, సాగు నీరు అందించాలని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం సిపిఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాదుకు అతి దగ్గరలో ఉన్న చౌటుప్పల్ మున్సిపాలిటీలో త్రాగునీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా చౌటుప్పల్ మండల కేంద్రంలో పైలాన్ ఏర్పాటు చేసినా, మండలంలోని పైప్ లైన్ వేయలేదన్నారు. 2011సంవత్సరం జనాభా దృష్టిలో పెట్టుకొని చౌటుప్పల్ మున్సిపాలిటీ 30వేల జనాభాను దృష్టిలో పెట్టుకొని అప్పుడు నీటి కేటాయింపు చేశారని, ప్రస్తుతం చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఒక లక్ష జనాభా ఉందని, ఈ జనాభా ప్రకారం నీటిని సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా చౌటుప్పల్ మండలంలో పిలాయిపల్లి కాలువ ద్వారా కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతున్నా, లక్కారం, తంగడపల్లి, మల్కాపురం, నాగారం, పీపల్ పహాడ్, ఖైతాపురం చెరువులకు నీరు మళ్ళించే డిండి ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని, ఈ చెరువులను కృష్ణా జలాలతో నింపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, కొండూరు వెంకటేష్, నీలం బిక్షపతి, దాసరి అంజయ్య, కాకి పాండు, బోయ మంకులు, దాసరి కృష్ణ, దాసరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి సీఐగా బత్తుల సత్యనారాయణ బాధ్యతలు




ప్రజాస్ఫూర్తి ఇల్లందు : ఇల్లందు నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన తాటిపాముల సురేష్, కొంతకాలంగా ఇల్లందులో విధులు నిర్వహిస్తున్న సీఐ బత్తుల సత్యనారాయణ ప్రస్తుతం టేకులపల్లి సీఐగా బత్తుల సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు.

# పార్టీలకతీతంగా.. అర్హులందరికీ.. రేషన్ కార్డుల పంపిణీ

* దేశానికి స్వాతంత్రం, ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్
* నాడు.. నేడు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది
* మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పార్టీలకతీతంగా.. రాజకీయాలతో సంబంధం లేకుండా.. అర్హులైన నిరుపేదలందరికీ నిరంతరాయంగా రేషన్ కార్డును పంపిణీ జరుగుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బీ ఆర్ కే కన్వేన్షన్ హాల్ లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చౌటుప్పల్ మండలం, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చింది, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చింది, నూతన రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. దశాబ్ద కాలంగా చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను బాగు చేసుకుంటూనే.. నిరుపేదలకు ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. గతంలో రేషన్ ద్వారా ఇచ్చే దొడ్డు బియ్యం దళారుల చేతిలోకి వెళ్తుందని, ప్రభుత్వ ఖర్చు చేసే ప్రతి పైసా నిజమైన పేదవాడికి ఉపయోగకరంగా ఉండాలనే ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. రేషన్ కార్డులు ఎలా ఇస్తున్నామో, ఇందిరమ్మ ఇల్లు ఎలా ఇస్తున్నామో.. రాబోయే కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇప్పిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వాళ్లకి 10సంవత్సరాలలో నిరాశే మిగిలిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఇల్లులు ఇవ్వలేదని, రేషన్ కార్డులు ఇవ్వలేదు, మహిళలకు ఉచిత ప్రయాణం ఇవ్వలేదని ఆరోపించారు. నిరుపేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. మీ ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీ పైన ఉండాలని, మీ జీవితంలో మార్పు తీసుకొస్తుందన్నారు.



*** నూతన రేషన్ కార్డులు అందించడం అభినందనీయం***

**- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన రేషన్ కార్డులు అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్క నూతన రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కనీసం రేషన్ కార్డుల్లో కొత్త పేర్లు సైతం చేర్చలేదని ఆరోపించారు. పేద ప్రజలకు సన్నబియ్యం అందించడం మంచి పరిణామమన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్ష్యపూరితంగా కాకుండా, ఈ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని అధికారులు కోరుతున్నానన్నారు. ఇళ్ల విషయంలో కానీ, రేషన్ కార్డుల విషయంలో కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించిందన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచిచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పీటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ కౌన్సిలర్లు కొరగోని లింగస్వామి, బండమీది మల్లేశం, బాబా షరీఫ్, తహసిల్దార్ వీరాబాయి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకట్రామ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, ఆర్ ఐ లు బాణాల రామ్ రెడ్డి, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ వి. జితేష్ వి.పాటిల్ ని కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మంగళవారం జిల్లా కలెక్టర్ వి. జితేష్ వి.పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. గ్రంథాలయాల ఆధునీకరణ, పాఠకుల సంఖ్య పెంచడం, పుస్తకాల సమృద్ధి, సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఈ సందర్భంగా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట , ప్రజా స్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటించారు. ఈ పర్యటన లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పలు భవనాలను,సీసీ రోడ్లను ప్రారంభించారు. మోటకొండూరు మండలం కదిరేని గూడెం గ్రామంలో శామల నర్సమ్మ, వారి కొడుకు కోడలు లక్ష్మీ అశోక్ ల ఇందిరమ్మ ఇళ్లను గృహ ప్రవేశం చేసి వారికి పట్టు బట్టలు పెట్టి ఇచ్చిన మాట ప్రకారం యాట పోతును అందజేశారు.. గృహప్రవేశం చేసి ప్రత్యేక పూజా నిర్వహించారు. ఆ తర్వాత ఇల్లును సందర్శించి వంటగదిలో పాలు పొంగించారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చినందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. గత కొన్నిఏళ్లుగా ఇల్లు కట్టుకోలేని స్థితిలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు రావడంతో చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీర్ల ఐలయ్య గారికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అమ్మవారి ఫలహర బండి ఉరేగింపు



మల్కాజ్గిరి ,ప్రజాస్ఫూర్తి : ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా ఓల్డ్ మల్కాజిగిరి లో మల్కాజ్ గిరి మాజీ కార్పొరేటర్లు నీరుగొండ మంజుల జగదీష్ గౌడ్ ల ఆధ్వర్యంలో జరిగిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు మండలి రాధాకృష్ణ,బిఆర్ఎస్ నాయకులు జే ఏ సి వెంకన్న, మురుగేష్, వీరేశం యాదవ్, జి కే హనుమంతు రావు, మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, భాగ్యానంద్ ,మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బైరు అనిల్ , ఉపేందర్, బద్దం హేమంత్ రెడ్డి, అరుణ్, వంశీ ముదిరాజ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, మురళి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు .





## ఒకపక్క గుడి.. మరోపక్క అంబేద్కర్ విగ్రహం..

* ఇక్కడ అంతా దుర్గంధ భరితం..
* నాలాను కబ్జా చేసి నిర్మాణం.. పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంబేద్కర్ విగ్రహం సాక్షిగా.. దుర్గంధం వెదజల్లుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. అమ్మవారి చల్లని దీవెనలు పొందాలనుకునే భక్తులు.. దుర్గంధ భరితంలో కుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.. ఇది అధికారుల నిర్లక్ష్యం వల్లనే అని స్థానికులు ఆరోపిస్తున్నారు.మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రామవరం లోని నాళాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్లనే జాతీయ రహదారి రోడ్డుపై నిలిచిన వర్షపు నీళ్లు కనకదుర్గమ్మ గుడిలోకి ప్రవేశిస్తున్నాయని, తక్షణమే నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, మరియు రామవరం ఆటో యూనియన్ అధ్యక్షులు.ఎస్కే జలీల్ లు డిమాండ్ చేశారు. మంగళవారం కనకదుర్గమ్మ గుడి వద్ద నిలిచి ఉన్న నీళ్లను పరిశీలిస్తూ వారు మాట్లాడుతూ ప్రతిరోజు మున్సిపల్ శానిటేషన్ అధికారులు విధులు నిర్వహిస్తున్న ఈ ప్రాంతంలో రోడ్డుపై నీళ్ళు నిలిచి వారు చర్యలు తీసుకోకపోవడం వల్ల వాహనదారుల తీవ్ర



ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వాహనాలు పోయే సందర్భంలో కనకదుర్గమ్మ గుడిలోకి మురికి నీరు ప్రవహిస్తున్నాయని, దీనంతటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని వారు అన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి మురికినీరు గుడిలోకి ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే నాళాలను కబ్జా చేసిన కబ్జాదారులపై చర్యలు తీసుకొని యధాతరంగా నాళాలను ఓపెన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సీనియర్ నాయకులు భవాని, సూరిమేని జనార్ధన్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కామ్రేడ్ అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని సిపిఎం మేడ్చల్ జిల్లా నాయకులు, బాచుపల్లి మండల సిపిఎం కార్యదర్శి కామ్రేడ్ బి వెంకటరామయ్య అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సుందరయ్య భవన్ నందు కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ వి ఎస్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మేడ్చల్ జిల్లా నాయకులు, బాచుపల్లి మండల సిపిఎం కార్యదర్శి కామ్రేడ్ బి వెంకటరామయ్య మాట్లాడుతూ కామ్రేడ్ వి ఎస్ 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరారని సుమారు ఎనిమిదిన్నర దశాబ్దాల పాటు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి పార్టీలో కీలకమైన అనేక బాధ్యతలను నిర్వర్తించారన్నారు. సిపిఎం పార్టీ అగ్రస్థాయి నాయకులుగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా సమర్థతకు మారుపేరుగా కార్య దక్షుడిగా నిల్చారన్నారు. కుట్టనాడ్ భూస్వాముల చేతుల్లో భయంకరమైన దోపిడికి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య ఉంటూ వారితో కలిసి పనిచేసే బాధ్యతలను ఆయనకు పార్టీ నాయకులు కృష్ణ పిళ్ళై అప్పగించారు అన్నారు. ట్రావెన్కోర్ దివాన్ కు వ్యతిరేకంగా పున్నాప్ర వాయిలర్ తిరుగుబాటు సమయంలో వి ఎస్ అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చింది అన్నారు. తరువాత వీఎస్ అరెస్టు అయిన తర్వాత కస్టడీలో ఆయన తీవ్ర వేధింపులను ఎదుర్కొన్నారు అన్నారు. 1980 నుంచి 1991 వరకు సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పని చేశారు అన్నారు. కేరళ అసెంబ్లీకి 7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు అన్నారు. రెండు పర్యాయాలు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారు అన్నారు. 2006 నుండి 2011 వరకూ కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన పాలనాపరమైన చర్యలు చేపట్టారు అన్నారు. ఆయన మృతి పార్టీకి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని వారి యొక్క ఆదర్శవంతమైన కమ్యూనిస్టు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్ మండల నాయకులు ఎం. చంద్రశేఖర్ ,బాల వెంకటేశ్వరరావు మరియు నాయకులు అక్బర్ మల్లేష్ రవి తదితరులు పాల్గొని కామ్రేడ్ వి ఎస్ కు నివాళులర్పించారు.



## ఆశయం ఆచరణ కలగలిసిన విప్లవకారుడు అచ్యుతానందన్

* సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆశయం ఆచరణ కలగలిసిన విప్లవకారుడు అచ్యుతానందన్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు.స్థానిక మంచికంటి భవన్లో అమరజీవి కామ్రేడ్ వి ఎస్ అచ్చుతానందన్ సంతాప సభ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ అధ్యక్షతన జరిగింది, ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం జరిగిన సభలో పోతినేని మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన వి.ఎస్ కమ్యూనిస్టు పార్టీ లో చేరి అనేక పోరాటాల కు నాయకత్వం వహించారని అన్నారు,అదే విధంగా సిపిఎం పార్టీ ఆవిర్భావ సభ్యుడి నుంచి కేరళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వరకు వి.ఎస్ ప్రజా జీవితం ఆదర్శనీయమని అన్నారు, కేరళ రాష్ట్రంలో ప్రజలందరి మన్ననలు పొందిన నాయకుడిని అన్నారు, కమ్యూనిస్ట్ ఉద్యమ శిఖరంలా ఆయన ఎదిగారని తెలిపారు,17 సంవత్సరాల వయస్సులో కమ్యూనిస్ట్ పార్టీలో చేరి కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాముల, పెట్టుబడిదారుల వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు,1964లో కమ్యూనిస్ట్ పార్టీ విడిపోయినప్పుడు, 32 మంది స్థాపక సభ్యులలో ఒకరిగా ఉన్నారు. 1980-1991 మధ్య కేరళ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని,7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని 2006-2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా, 2011-2016 వరకు ప్రతిపక్ష నేతగా పనిచేశారని అన్నారు ,ఎంత ఎదిగినా నిరాడంబరంగా జీవించారన్నారు. 1970 లో పేదలకు భూమి దక్కేవరకు. భూ పోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు . ప్లాచిమాడా కోకాకోలా ప్లాంట్ వ్యతిరేక పోరాటం, మూనార్ భూ ఆక్రమణలు, వెట్ ల్యాండ్ పరిరక్షణ వంటి అంశాలపై సాహసోపేతంగా పోరాడారు .సామాజిక న్యాయం కోసం నర్సులు, ట్రాన్స్‌జెండర్ల హక్కుల కోసం, అక్రమ లాటరీ మాఫియా, సినిమా పైరసీ వ్యతిరేకంగా ఉద్యమాలను నడిపారు . ముఖ్యమంత్రిగా టెక్నోపార్క్, వల్లర్పాడం టెర్మినల్ వంటి మౌలిక సదుపాయాలను ప్రారంభించారని ప్రభుత్వ విద్యాలయాలలో ఉచిత , ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను ప్రోత్సహించారు. రిచర్డ్ స్టాల్మన్ వంటి ప్రపంచ నాయకుల మద్దతును పొందారు . 2007లో శబరిమల దేవస్థానాన్ని దర్శించిన మొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు . 8 దశాబ్దాల కమ్యూనిస్ట్ ఉద్యమానికి "ప్రజల నాయకుడు"గా గుర్తింపు పొందారని ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాడినందుకు "పోరాట శిఖరమయ్యారని ఆయన స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తామని వారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి,కె. బ్రహ్మాచారి,,కారం పుల్లయ్య,లిక్కి బాలరాజు,అన్నవరపు సత్యనారాయణ,రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మా, కే శ్రీధర్ ఎస్ ఏ నబీ దొడ్డా రవి మర్మం చంద్రయ్య ఎలమంచి వంశీకృష్ణ వీర్ల రమేష్, భూక్యా రమేష్, ముదిగొండ రాంబాబు,బి.చిరంజీవి,జి. పద్మ, సున్నం గంగ, చిలకమ్మ,యాసా నరేష్,గడ్డం స్వామి,కోబల్,,పిట్టల అర్జున్,కొండబోయిన వెంకటేశ్వర్లు, సత్రపల్లి సాంబశివరావు,గద్దల శ్రీనివాస్, మోరంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా ఆషాఢ మాస బోనాలు







ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భక్తి శ్రద్ధలతో బోనమెత్తిన చిన్నారులు.. పోతురాజుల నృత్యాలు.. అమ్మవారి వేషధారణలతో సందడే సందడి. పాల్వంచలో స్థానిక నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో మంగళవారం ఆషాఢ బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులలో విద్యార్థిని విద్యార్థినులు అమ్మవారు, పోతురాజు రూపాలలో వచ్చి అందరిని ఆకట్టుకున్నారు. ఇ చాంప్స్ విద్యార్థులు తమ నృత్యాలతో అందరిని అలరించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాలల ఖమ్మం జోన్ ఏజిఎం యోగ రాంకీ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియపరచడానికి ఈ బోనాల వేడుకను నిర్వహించామని, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరవాత మన సంస్కృతి, సంప్రదాయాలైన కట్టు, బొట్టు, బోనాలకు తగిన గుర్తింపు లభించిందని , అందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు పూరేటి నరసింహారావు మాట్లాడుతూ తమ నారాయణ పాఠశాలలో బోనాల పండుగ ఘనంగా జరుపుకుంటామని, భక్తి శ్రద్ధలతో అమ్మలనూ కన్నా అమ్మ దుర్గమ్మను కొలిచి, చదువులు బాగా రావాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ మట్టికుండలలో నైవేద్యాన్ని వండి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనమెత్తారు. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, ఈ టెక్నో ఏడి రామకృష్ణ, ఈ చాంప్స్ వీపీ రుచిత శ్రీ , ఈ కిడ్స్ వీపీ ఏం.పద్మ, ఏవో వీర, ఉపాధ్యాయులు రహీమా, శైలజ, శ్రీలత, ఉషా, అలియా, కళ్యాణి, జాహ్నవి, అఫ్రీన్, ముస్కాన్, మల్లేష్, సుజీత్, దీప్తి, రవీంద్ర, బాలాజీ, రమేష్, అనూష, కావ్య, అఖిల, శ్రావణి, సరిత, మహేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ముగిసిన రాష్ట్ర హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఎన్నికలు





కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్రంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఎన్నికలు సెంట్రల్ జాయింట్ సెక్రటరీ మిస్టర్ అతుల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సజావుగా ముగిశాయి. ఎన్నికల నిర్వహణ బాధ్యతను నిర్వాహకులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక గుర్తింపు పొందిన సంఘంగా అభివృద్ధి చెందింది. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ సంస్థలు మిస్టర్ బద్రీనాథ్ రీజనల్ ఆర్గనైజింగ్ కమిషనర్ అనే కీలక పదవికి నియమితులయ్యారు. ఈ నియామకంతో ఆయనకు తూర్పు తీర రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలలో స్కౌటింగ్ కార్యకలాపాల సమన్వయ బాధ్యతలు అప్పగించబడ్డాయి.మహామన మదన్మోహన్ మాల్వి 1928లో భారత దేశంలోని పేద వెనుకబడిన పిల్లలకు స్కౌటింగ్ అర్హత కల్పించాలని సంకల్పంతో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ప్రారంభించారు. అప్పట్లో అది ఒక సాధారణ సంఘంగా కొనసాగుతున్నా ఇప్పుడు తన దీర్ఘ అనుభవం , పరిపక్వతతో మిస్టర్ బద్రీనాథ్ స్కౌటింగ్ ఉద్యమానికి కొత్త ఊపును తీసుకు వస్తారని సంస్థ నమ్మకం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతాలలో యువత సామాజిక సేవ కార్యక్రమాలలో మరింత చురుకుగా పాల్గొనేలా ఆయన ప్రణాళికలు రూపొందించనున్నారని తెలియజేశారు. ఆయన నాయకత్వంలో హిందుస్థాన్ స్కౌటింగ్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంపై సానుకూల ప్రభావం చూపుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం యొక్క పరిపాలన వ్యవహారాల్లో డాక్టర్ ప్రవీణ్ ను స్టేట్ చీఫ్ కమిషనర్ గా డాక్టర్ సురేష్ ను స్టేట్ సెక్రటరీగా అధికారికంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఇద్దరూ తమ అనుభవంతో సంస్థకు మరింత బలాన్ని చేకూర్చుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో కేంద్ర స్థాయిని ప్రతినిధించే బాధ్యతలతో మిస్టర్ మహేందర్ నాయక్ ని నోడల్ అధికారిగా ఎన్నుకోవడం జరిగింది. ఆయన తన గత అనుభవం సంకల్పం సమర్థతను పరిగణలోకి తీసుకొని ఈ పదవికి ఎంపిక చేశారు. ముందున్న కార్యక్రమాల సమన్వయం, కేంద్ర , ప్రాంతీయ విభాగాల మధ్య సమర్థవంతమైన సమాచార ప్రవాహం , పర్యవేక్షణ బాధ్యతలు ఈ నూతన నియామకంతో మరింత బలపడనున్నాయి.



## సర్కార్ భూముల్లో రాత్రికి రాత్రే నిర్మాణాలు పూర్తి చేస్తున్న కబ్జాదారులు

- **కబ్జా దారులకు కనక వర్షం కురిపిస్తున్న సర్కారు భూములు...**
- **బోడుప్పల్ లో రోజు రోజుకు పుట్టుకొస్తూన్న ఇంటి పట్టాలు...**
- **తూతూ మంత్రంగా చర్యలు....**

బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జా దారుల పాలిట కనక వర్షం కురిపిస్తున్నాయి.ప్రభుత్వ భూములలో రాత్రి రాత్రే నిర్మాణాలు చేపడుతూ యూదేచ్ఛగా ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు.అంతే కాకుండా ఎప్పుడో సర్కారు పంపిణీ చేసిన ఇండ్ల పట్టాలను ఇప్పుడు పాత తేదీలలో సృష్టించే విషయంలో బహిరంగ మార్కెట్ లో అందరికి తెలిసిన విషయమే. సర్కారు భూములు కబ్జాకు గురువుతున్న విషయం అందరికి తెలిసిన కనీసం వాటిని పరిరక్షించడానికి ఏలాంటి చర్యలు తీసుకోక పోవడం చూస్తుంటే కబ్జాలో "తల పాపం తిలా పిడికెడు" ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

- **సర్కారు భూములే కబ్జా దారులకు ఆదాయవనరు...**

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి బోడుప్పల్ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 63/26 నుండి 63/39 లో సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చూపిస్తున్నాయి. కానీ వాస్తవంగా మాత్రం కేవలం ఇరవై, ముప్పై రెండు ఎకరాలు మాత్రమే ఉంటుందనేది అంచనా. మిగిలిన భూమి పూర్తి స్థాయిలో కబ్జాలకు గురైంది. రాత్రికి రాత్రే ఇంటి పట్టాలు తయారు చేయాడం ఇండ్ల నిర్మాణం చేయాడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇలా చేపట్టిన ఇండ్లల్లో ఉండేది మాత్రం పేదలే అయిన దాని నిర్మాణం వెనుక ఖద్దరు నేతల హస్తం పెద్ద యెత్తున ఉందనేది బహిరంగ రహస్యం. ఇక్కడ ప్రస్తుతం భూమి ధర గజం ముప్పై వేల వరకు ఉంటుంది. ఇక్కడ 60,120 గజాల చొప్పున ప్లాట్లు చేయాడం అ ప్లాట్లకు నోటరి లేదా పాత పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలు చేయాడం జరుగుతుంది. ఈ స్థలాలలో ఎక్కువగా రాత్రి పూట లేదా ప్రభుత్వ సెలవు దినాల్లో ఎక్కువ భాగం నిర్మాణాలు చేస్తుంటారు. పేరు పెదలది కాగా ఆదాయం మాత్రం పెద్దల జేబుల్లోకి వెళ్తుంది.



**రెవెన్యూ అధికారులపై వత్తిడిలు...**

ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో సంరక్షించి ప్రజా అవసరాలకు వినియోగించాలనేది రెవెన్యూ అధికారుల అలోచన కానీ ఇక్కడ కబ్జాలను అరికట్టడంలో రెవెన్యూ అధికారులు ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి అనే చందంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణ పూర్తి స్థాయి భాద్యత రెవెన్యూ అధికారులదే అయిన కూడా చర్యలు తీసుకోవడంలో ఎందుకి నిర్లక్ష్యం అంటే వారి నుండి ఏలాంటి సమాధానం రాదు.ఎప్పుడైనా రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవడానికి వెళ్ళిన వారికి పలువురు రాజకీయ పార్టీల నేతల నుండి తీవ్రమైన వత్తిడిలు వస్తూనే ఉంటాయి.మరీ రాజకీయ నాయకుల వత్తిడిలకు తలొగ్గి సర్కారు భూములను కబ్జా చేస్తున్న వారికి సహకరిస్తారా లేక తమ వృత్తి ధర్మాన్ని ఉపయోగించి సర్కారు భూములను కాపాడుతారా అనేది వేచి చూడాలి.

- **చర్యలు తీసుకుంటున్నాం: హసీనా,మేడిపల్లి మండల తహసీల్దార్**

బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు కఠినమైన చర్యలు తీసుకుంటున్నాము.ఇప్పటికే అక్కడ భూముల వివరాలను ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందించడం జరిగింది. రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసులు నమోదు చేశాం. భవిష్యత్తులో కూడా కబ్జాకు పాల్పడిన వారెవరైనా వారిపై కఠిన చర్యలు ఉంటాయి అని అన్నారు...

## చెరువుకు జీవం పోసారు!

- **పార్క్ లను అభివృద్ధి చేసారు:**
- **సంగటిత శక్తికి ప్రతీకగా: స్ఫూర్తిగా నిలుస్తున్న కౌసల్య కాలనీ వాసులు: :మద్దెలకుంట చెరువు పునరుజ్జీవణం:**
- **అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధికి బాటలు!**



ప్రజాస్ఫూర్తి, నిజాంపేట్ :ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా కళ్ల ముందు కనిపిస్తున్న సమస్యల పరిష్కారానికి చేయి చేయి కలిపి ఒక్కటిగా పనిచేసారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కాలనీ అభివృద్ధి కై కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని కౌసల్య కాలనీ ప్రజలు.సామజిక బాధ్యత, సంగటిత శక్తికి ప్రతీకగా నిలుస్తూ తమ కాలనీ సమీపంలో వున్న మద్దెల చెరువు పూడిక తీసి, పార్క్ ను శుభ్రం చేసుకుని ఇతర కాలనీవాసులకు స్ఫూర్తిగా నిలిచారు.ఎలాంటి ప్రభుత్వ మద్దతు లేకుండానే, స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి తమ కాలనీ అభివృద్ధి కి బాటలు వేస్తున్నారు. చెరువును శుద్ధి చేసుకుని,పచ్చదనాన్ని పెంచుతూ, ఆట స్థలాలను అభివృద్ధి చేస్తూ భవిష్యత్తు తరాలకు బాసటగా నిలుస్తునారు.ప్రదానంగా అవిరల కృషితొ చెరువు పూడిక తీసి జీవం పోసేలా చేసి ఔరా అనిపించారు.వారి కృషి చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వర్షాకాలంలో మంచినీటి నిల్వకు ఎంతగానో దోహదపడింది. ఇక పార్క్ సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, మరమ్మతు పనులు చెత్త వ్యర్ధాల తొలగింపు మొక్కల పెంపకం, పార్క్ సుందరికరణతొ ఇప్పుడు చిన్నాపెద్దలందరికీ ఆరోగ్యకరమైన విశ్రాంతి ఆహ్లాద కరం గా పార్క్ లు వున్నాయి.అసోసియేషన్ ఆధ్వర్యంలో.... 10 సంవత్సరాలుగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే పార్కుల్లో పిల్లల ఆట వస్తువుల ఏర్పాటుతో పాటు వాటి నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, చెట్ల పెంపకం చేపడుతున్నారు. గత 3 సంవత్సరాలలో మూడుపార్కు స్థలాలను కబ్జాలకు గురికాకుండా కాలనీవాసుల సంఘటితంగా ఉండి కాపాడుకున్నారు.వారి పోరాటాలతో కాపాడిన ఆ మూడు పార్కులలో ఆట వస్తువులు ఏర్పాటు చేసి పార్కు స్థలాలకు కంచెలు వేసి పరిరక్షించుకున్నారు. నగరమంతా కాంక్రీట్ జంగల్ గా మారుతున్న రోజుల్లో పచ్చదనం కొరవడుతున్న తరుణం లో రాజకీయ నాయకుల బెదిరింపులను, కేసులను ఎదుర్కొంటూ, కాలనీ లో ఉన్న పార్క్ స్థలాలను కాపాడుకున్నారు.

- **అధికారులు సహకరించాలి!: శివ ప్రసాద్ కౌసల్య కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు:**

ఇన్నాళ్లు ఎవరి సహాయం కోసం ఎదురుచూడకుండా కాలనీ ప్రజల సొంత ఖర్చులతొ కాలనీ లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. కాలనీ వాసుల ఐక్యతతొ అసాధ్యం అనుకున్న పని సుసాధ్యం చేసాం.ప్రస్తుతం కాలనీ పార్క్ లో కొంత భాగం పెండింగ్ లో ఉన్న కాంపౌండ్ వాల్, లైటింగ్, పార్క్ ఆధునీకరణ కోసం ప్రభుత్వం,నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సహకారం అందించాలి.





## కమ్యూనిస్టు యోధుడు వీఎస్ అచ్యుతానందన్ మహోన్నత ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత

- **సిపిఎం పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కమ్యూనిస్టు యోధుడు వీఎస్ అచ్యుతానందన్ మహోన్నత ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత అని సిపిఎం పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం షాపు నగర్ పార్టీ కార్యాలయంలో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ నాయకులు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రిగా, సీపీఐ(ఎం) వ్యవస్థాపక సభ్యులుగా కేరళ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ప్రజాభిమాన నేత, కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ అని అన్నారు. కేరళ రాష్ట్రాన్ని ఆధునిక రాష్ట్ర స్థాయికి అభివృద్ధిపరిచిన అనేక మహత్తర పోరాటాలకు మారుపేరుగా నిలిచిన కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ సోమవారం మధ్యాహ్నం 3.20గంటలకు తిరువనంతపురం హాస్పటల్లో తుది శ్వాస విడిచారన్నారు. వీఎస్‌గా అందరికీ సుపరిచితుడైన వెళిక్కకథ శంకరన్ అచ్యుతానందన్ కేరళ అసెంబ్లీకి ఏడు



పర్యాయాలు ఎన్నికయ్యారు.ప్రస్తుతం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్న ఆయన ఒక పర్యాయం ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాలు ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. 198091 వరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారన్నారు. అవినీతికి, ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా రాజీపడని రీతిలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి పసుల అంజయ్య , ఈ దేవదానం. కరుణాకర్. పార్టీ నాయకులు మల్లారెడ్డి నర్సింలు, కే శీను,భాష తిమ్మప్ప ,యాదవ రెడ్డి సాధులు, కనకయ్య వీరేష్, తదితరులు పాల్గొన్నారు .

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు

* రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా
* ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత
* బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు.ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.



## భారీ వర్షా లు..
# తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

* భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
* కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
* వెల్లడించిన వాతావరణ శాఖ సంచాలకురాలు

తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

# ఈరోజుకు వర్క్ ఫ్రమ్ హోమ్ పాటిస్తే మేలు

* కంపెనీలకు సైబరాబాద్ పోలీసుల సూచన
* ఈరోజు హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం
* హెచ్చరించిన వాతావరణ కేంద్రం
* ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే మంచిదని సూచన



భాగ్యనగర ప్రజలకు, ముఖ్యంగా సంస్థలకు సైబరాబాద్ పోలీసులు ముఖ్య సూచన చేశారు. మంగళవారం నాడు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. గత రెండు మూడు రోజులుగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సైబరాబాద్ పోలీసులు 'ఎక్స్' వేదికగా ఈ సూచన చేశారు. ఐటీ కంపెనీలు మంగళవారం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిని పాటిస్తే మంచిదని సూచించారు. కంపెనీలు సహకరించాలని కోరారు.

## కులగణన నుంచి రిజర్వేషన్ల వరకూ..
# బీసీలను మోసం చేయటమే కాంగ్రెస్ వైఖరి



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం నుంచి బీసీ డిక్లరేషన్ వరకూ ప్రతి విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరిని అవలంబిస్తోందని BRS పార్టీ తీవ్రంగా మండిపడింది. బోనాల పండుగ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో అందుబాటులో బీసీ నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల చేస్తున్న ద్రోహపూరిత చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీల హక్కులను కాలరాసే విధంగా రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ల విషయాన్ని ఉపయోగించుకుంటోందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మోసపూరిత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. కులగణన సర్వే నుంచి ప్రస్తుతం తీసుకొస్తున్న ఆర్డినెన్స్ వరకు, ప్రతి దశలోనూ బీసీల సంఖ్యను తగ్గించి చూపడం, హామీలను అమలు చేయకపోవడం ద్వారా అన్ని స్థాయిల్లోనూ బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యంగా ఉందని విమర్శించింది. అంతేకాదు, కాంగ్రెస్ ప్రభుత్వం తాము తీసుకొచ్చిన రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి పాల్పడుతోందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే లోపభూయిష్టంగా, దురుద్దేశపూర్వకంగా జరిగిందని మండిపడ్డారు. ఈ సర్వేను జాతీయ రోల్ మోడల్‌గా చిత్రీకరిస్తూ, జాతీయ వేదికలపై అబద్ధాలు ప్రచారం చేస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను నిలిపివేసిన కాంగ్రెస్, బడుగు బలహీన వర్గాల అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపుతోందని విమర్శలు గుప్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. బీసీల సాధికారత కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీసీలను మోసం చేయడాన్ని సహించబోమని తెలిపారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి స్థాయిలో పోరాటం కొనసాగుతుందన్నారు.

# తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

* టీజీ టెట్ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థుల ఉత్తీర్ణత
* జూన్ 18 నుంచి 30 వరకు జరిగిన పరీక్షలకు 1,37,429 మంది హాజరు
* మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడి



తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (TG TET) ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన పరీక్షకు 1,37,429 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడించింది. టెట్ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఆన్ లైన్ లో నేరుగా విడుదల చేశారు. పేపర్ 1,2 లకు ఏడు భాషల్లో పరీక్ష నిర్వహించారు. పేపర్ 1 పరీక్షకు 47,224 మంది హాజరైతే.. 29,043 మంది పాస్ అయ్యారు. పేపర్ 2లో మ్యాథ్స్ అండ్ సైన్స్ పేపర్ లో 48,998 మంది పరీక్ష రాస్తే 17,574 మంది క్వాలిఫై అయ్యారు. పేపర్ 2 లోని సోషల్ స్టడీస్ లో 41,207 మంది ఎగ్జామ్ రాస్తే 13,075 మంది ఉత్తీర్ణులయ్యారు. అధికారిక వెబ్‌సైట్ http://tgtet.aptonline.in/tgtet/ResultFront లో అభ్యర్థులు తమ ఫలితాలు చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# కార్డులు అర్హులకే.. స్పీడ్ పెంచిన మంత్రి పొన్నం.. కీలక ఆదేశాలు



నూతన రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నూతన రేషన్ కార్డుల ప్రక్రియ వెరిఫికేషన్, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రమంతటా రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈనెల 25 నుండి ఆగస్టు 10 వరకు నియోజకవర్గాల వారీగా నూతన రేషన్ కార్డుల అందజేత ప్రక్రియ ఉంటుందని మంత్రి వివరించారు. హైదరాబాద్ జిల్లాల్లో ఉన్న 15 నియోజకవర్గాలకు 15 మంది నోడల్ అధికారులను నియమించి నూతన రేషన్ కార్డులు వెరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేశామని తెలిపారు. జిల్లాలో నూతన రేషన్ కార్డుల కొరకు 2,19,717 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 92,842 దరఖాస్తులను పరిశీలించడం జరిగిందని. ఇంకా 1,26,875 కార్డులు వెరిఫికేషన్ చేయవలసి ఉందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన వాటిలో 43,115 రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీ నుండి 1100 మంది ఆర్పీలను వెరిఫికేషన్ ప్రక్రియకు వినియోగించుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులను మాత్రమే గుర్తించి కార్డులు అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలిసి సమీక్ష నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. స్లమ్ ఏరియాలలో వైద్య శిబిరాలు చేపట్టాలని , ప్రాంతాల వారీగా ఏర్పాటుచేసిన బృందాలచే ఫాగింగ్ చేపట్టాలని అన్నారు . ఈ కార్యక్రమంలో డి ఎం ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటి, జిల్లా టీవీ నివారణ అధికారి డాక్టర్ చల్లా దేవి, డిప్యూటీ డిఎం హెచ్ ఓ లు, వివిధ విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు



## నిజాం కాలేజీలో ఉద్రిక్తత..
# ఆందోళనకు దిగిన విద్యార్థినులు

నిజాం కాలేజీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులను హాస్టల్‌కు రావాలని పిలిచిన యాజమాన్యం ఫెసిలిటీ కల్పించలేదు. దీంతో విద్యార్థినులు ధర్నాకు దిగారు. లగేజీ తీసుకుని వచ్చిన విద్యార్థినులను హాస్టల్‌లోకి అనుమతించకపోగా కనీసం ఫుడ్ కూడా పెట్టలేదు. కొద్దిరోజులు సమయం కావాలని ఆ తరవాతనే హాస్టల్‌లోకి అనుమతిస్తామని వార్డెన్ చెప్పడంతో విద్యార్థినులు హాస్టల్ ముందు ధర్నాకు దిగారు. సాయంత్రం వర్షంలో ధర్నాకు దిగిన విద్యార్థులు రాత్రైనా ధర్నా కొనసాగించారు. చీకటిపడటంతో సెల్ ఫోన్ లైట్స్ ఆన్ చేసుకుని నినాదాలు చేశారు. డీడీ కట్టించుకున్న విద్యార్థులను వెంటనే హాస్టల్‌లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అసమర్థ ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అసెంబ్లీ అడ్వైజరీ కమిటీ



సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ సభ్యులు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ పరిపూర్ణ చారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా కమిటీ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. అసెంబ్లీ కార్యకలాపాలు, మీడియా సంబంధిత విషయాలపై సమర్థవంతమైన సమన్వయం కోసం కమిటీ యొక్క పాత్రను బలోపేతం చేయడంపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిటీ సభ్యుల సూచనలను స్వాగతించి, పారదర్శకమైన పాలన మరియు ప్రజలకు సమాచారం అందించడంలో మీడియా యొక్క కీలక పాత్రను ప్రశంసించారు.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి**
**13 పాయింట్ల తగ్గిన సెన్సెక్స్**
**29 పాయింట్ల క్షీణించిన నిఫ్టీ**




**ముంబై:** అమెరికా టారిఫ్‌లపై అస్పష్టత, మదుపరుల లాభాల స్వీకరణతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు దాదాపు ఫ్లాట్ గా ముగిశాయి. ఆగస్టు 1న అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం గడువు సమీపిస్తుండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు. సెన్సెక్స్ 13.53 పాయింట్లు (0.02 శాతం) తగ్గి 82,186.81 వద్ద ముగిసింది.

అంతకుముందు రోజు 82,200 వద్ద ముగిసిన సెన్సెక్స్, మంగళవారం 82,527.27 వద్ద సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ వంటి భారీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో లాభాలను కోల్పోయింది.

నిఫ్టీ 29.80 పాయింట్లు (0.12 శాతం) క్షీణించి 25,060.90 వద్ద స్థిరపడింది. గడువు సమీపిస్తున్నప్పటికీ అమెరికా టారిఫ్ లపై స్పష్టత లేకపోవడం మార్కెట్‌లో అనిశ్చితికి దారితీసింది.త్రైమాసిక ఫలితాల వెల్లడి మార్కెట్‌లో ఒడుదొడుకులకు దారితీసింది. అనేక మంది పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు.

టాటా మోటార్స్, రిలయన్స్, ఎస్‌బిఐ, ఐటిసి, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్%ుడ%టి ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్, సన్ ఫార్మా నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, టైటాన్, బీఈఎల్, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి, మహీంద్రా అండ్ మహీంద్రా లాభాలను నమోదు చేశాయి. దేశీయ మూలధన మార్కెట్లు బలహీనంగా ఉండటంతో, రూపాయి మారకం విలువ 0.08 శాతం తగ్గి డాలర్‌తో పోలిస్తే 86.36 వద్ద ట్రేడ్ అవుతోంది.

## అదానీ నయా ప్లాన్..
## ఆ రంగంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు



**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ వచ్చే ఐదు సంవత్సరాలలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో దేశంలోని విమానాశ్రయాలను విస్తరించనుంది. ప్రస్తుతం ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తున్న అదానీ గ్రూప్, నవీ ముంబై విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోనుంది. నవీ ముంబై, ముంబై, అహ్మదాబాద్, జైపూర్, తిరువనంతపురం, లక్నో మరియు గువాహటి విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి సారించారు.

అపర కుబేరుడు గౌతమ్ అదానీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించనున్నారు. ఇప్పటికే అనే రంగాల్లో అదానీ గ్రూప్ తన వ్యాపారాలను నిర్వహిస్తోంది. తాజాగా అదానీ గ్రూప్ తన విమానాశ్రయ వ్యాపారాన్ని మరింతగా విస్తరించనుంది. వచ్చే అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు ఈ రంగంలో పెట్టనున్నట్లు గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ గ్రూప్ విమానాశ్రయ వ్యాపారాధిపతి జీత్ అదానీ వెల్లడించారు. అదానీ గ్రూప్ మనదేశంలో ముంబయి సీఎస్ఎమ్ఐఏ సహా 7 విమానాశ్రయాలను ఇప్పటికే నిర్వహిస్తుండగా, వచ్చే అక్టోబర్ నాటికి నవీ ముంబయి విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోనుంది.

విమానాశ్రయ నిర్వహణలో ఇండియాలో దూసుకెళ్తున్న అదానీ గ్రూప్ ప్రస్తుతానికి ఇతర దేశాల్లో విమానాశ్రయాలకు విస్తరించే ప్రణాళికలు లేవని జీత్ తెలిపారు. 'మనదేశంలోనే వచ్చే 10-15 ఏళ్లలో విమానయానంలో భారీ వృద్ధి అవకాశాలున్నాయని మేం భావిస్తున్నాం. పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య) పద్ధతిలో అభివృద్ధి చేయడానికి 26 విమానాశ్రయాలను గుర్తించారు. అందుకే విదేశాల కంటే ఇక్కడే బలంగా విస్తరించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే 5 ఏళ్లలో విమానాశ్రయ మౌలిక వసతులు, స్థిరాస్తులపై రూ.95,000-96,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు జీత్ తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం నవీ ముంబయి విమానాశ్రయం, ముంబయి విమానాశ్రయంపైనే పెట్టనున్నట్లు తెలిపారు. నవీ ముంబయిలో రూ.19,000 కోట్లతో 2 కోట్ల మంది ప్రయాణికుల వార్షిక సామర్థ్యంతో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే టీ2లోనూ 3 కోట్ల మంది ప్రయాణించేలా రూ.30,000 కోట్లు, లేదా 5 కోట్ల మంది ప్రయాణించేలా రూ.40,000-45,000 కోట్ల పెట్టుబడులు పెడతామన్నారు. అలాగే అహ్మదాబాద్, జయపుర, తిరువనంతపురంలలో కొత్త టెర్మినళ్ల ఏర్పాటు ప్రణాళికలూ ఉన్నాయని, వీటితో పాటు లఖ్‌నవూలో కొత్త టెర్మినల్ విస్తరణ కూడా ఉంటుందని, గువహటిలో కొత్త టెర్మినల్‌ను అక్టోబరు-నవంబరుకల్లా అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీత్ వెల్లడించారు.

## ఫ్రాడ్ జాబితాలోకి అనిల్ అంబానీ..!



**న్యూఢిల్లీ:** రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో పాటు ప్రమోటర్ డైరెక్టర్ అనిల్ అంబానీని "ఫ్రాడ్" జాబితాలో చేర్చింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. సిబిఐకి కూడా ఫిర్యాదు చేసే ప్రక్రియలో ఎస్‌బీఐ ఉందని సోమవారం పార్లమెంటుకు సమాచారం అందింది. ఈ సంస్థలను జూన్ 13, 2025న మోసం రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఆర్బీఐ మాస్టర్ డైరెక్షన్స్, మోసాల వర్గీకరణ, రిపోర్టింగ్, నిర్వహణపై బ్యాంక్ బోర్డు ఆమోదించిన విధానం ప్రకారం మోసంగా వర్గీకరించినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

"జూన్ 24, 2025న బ్యాంక్ మోసం వర్గీకరణను ఆర్బీఐకి నివేదించింది. సీబీఐకి ఫిర్యాదు చేసే ప్రక్రియలో కూడా ఉంది" అని ఆయన చెప్పారు. ఇంకా జూలై 1, 2025న బహిర్గతం సమ్మతిలో భాగంగా ఆర్కాం రిజల్యూషన్ ప్రొఫెషనల్ బ్యాంకు మోసం వర్గీకరణకు సంబంధించి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేశారు. ఆర్కామ్‌లో ఎస్‌బిఐ క్రెడిట్ ఎక్స్‌పోజర్‌లో ఆగస్టు 26, 2016 నుండి అమల్లోకి వచ్చే వడ్డీ, ఖర్చులతో పాటు రూ.2,227.64 కోట్ల ఫండ్ ఆధారిత ప్రిన్సిపల్ బకాయిలు, రూ.786.52 కోట్ల నాన్-ఫండ్ ఆధారిత బ్యాంక్ గ్యారెంటీ ఉన్నాయని ఆయన చెప్పారు.

ఆర్కాం ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ కోడ్, 2016 కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్‌లో ఉంది. ఈ రిజల్యూషన్ ప్లాన్‌ను క్రెడిటర్ల కమిటీ ఆమోదించింది. మార్చి 6, 2020న ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో దాఖలు చేసింది. %చీజుు% ఆమోదం కోసం వేచి ఉంది. అనిల్ అంబానీకి వ్యతిరేకంగా ఐబిసి కింద బ్యాంక్ వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియను కూడా ప్రారంభించిందని, ముంబైలోని ఎన్‌సిఎల్‌టి కూడా ఇదే వాదనను వినిపిస్తోందని ఆయన అన్నారు. బ్యాంక్ గతంలో నవంబర్ 10, 2020న ఖాతాను, ప్రమోటర్ అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరించింది. జనవరి 5, 2021న సీబీఐకి ఫిర్యాదు చేసింది.

# బిన్నీకి 70 ఏళ్లు..



**బీసీసీఐ కొత్త బాస్ అతడేనా?..**

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలికి త్వరలోనే కొత్త బాస్ రానున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఉండగా ఇంకొకరి అవసరం ఏంటీ? అని అనుకుంటున్నారా?.. అందుకు కారణం ఉంది. అదేంటంటే బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడితో పాటు ఇతర సభ్యుల వయసు 70 ఏళ్లకు మించకూడదు. అయితే.. బిన్నీ మూడు రోజుల (జూలై 19న) క్రితమే ఏడు పదుల వసంతంలో అడుగుపెట్టాడు. రూల్ ప్రకారం ఆయనను తప్పించి.. మరొకరిని ఎన్నుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. సెప్టెంబర్‌లో వార్షిక సమావేశంజరిగేంత వరకూ బిన్నియే అధ్యక్షుడిగా వ్యవహరించనున్నాడు. అయితే.. ఆలోపు అతడి అధికారిక పత్రాలపై సంతకాలు చేయకూడదని నియమావళి చెబుతోంది. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యక్షుడిగా ఉన్న రాజీవ్ శుక్లా తదపరి బాస్‌గా నియమితులయ్యే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై స్పందించేందుకు బిన్నీ నిరాకరించాడు. ఈమధ్యే లార్డ్స్ టెస్టు వీక్షించిన ఆయన తర్వాత బెంగళూరు వచ్చాడు. అనంతరం తన 70వ బర్త్ డే వేడుకల కోసం థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లాడు.

**కొత్త బిల్లు విరుద్ధంగా..**

బీసీసీఐ నిబంధనలు సభ్యుల వయోపరిమితిని 70 ఏళ్లకు మించకూడదని చెబుతున్నాయి. కానీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న స్పోర్ట్స్ బిల్ ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉండనుంది. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశంలోనే ఈ బిల్‌ను మంత్రి మాండవీయ మన్సూఖ్ లోక్ సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటివరకూ స్వతంత్ర సంస్థగా ఉన్న బీసీసీఐ ఈ చట్టం పరిధిలోకే రానుంది.ఈ కొత్త చట్టం రూపుదాలిస్తే.. బీసీసీఐ సభ్యుల వయోపరిమితి 75 ఏళ్లుగా ఉండనుంది. అదే జరిగితే తదపరి బీసీసీఐ సభ్యులు అదనంగా మరో ఐదేళ్లు పదవిలో కొనసాగనున్నారు.

## హాకీ ప్లేయర్‌పై సామూహిక అత్యాచారం

**నలుగురు కోచ్‌లు అరెస్ట్**

**ఒడిశా:** ఒడిశా రాష్ట్రంలోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 ఏళ్ల హాకీ క్రీడాకారిణిపై ఆమెకు శిక్షణ ఇస్తున్న కోచ్‌లే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రూర్కెలాలోని సాయ్ సెంటర్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు గడిచిన రెండేళ్లుగా సాయ్ కేంద్రంలో హాకీ శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో జూలై 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

జూలై 21 రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు చేపట్టారని, నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారని భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. నలుగురు కోచ్‌లపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారు. కాగా ఈ ఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

## వాషింగ్టన్ సుందర్ భవిష్యత్ అత్యుత్తమ ఆల్‌రౌండర్

**ప్రశంసలు కురిపించిన రవిశాస్త్రి..!**



**న్యూఢిల్లీ:** టీమిండియా యువ ఆల్‌రౌండర్ వాషింగన్ సుందర్‌ను మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి ప్రశంసించాడు. భవిష్యత్‌లో సుందర్ భారత జట్టు అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా మారుతాడని ఆశాభవం వ్యక్తం చేశారు. పరిస్థితులను బట్టి బౌలింగ్ చేయడంతో పాటు సహజంగానే బ్యాటింగ్ చేయగల ప్రతిభ ఉన్న ఆటగాడని తెలిపాడు. ఓర్పు, సాంకేతిక నైపుణ్యం అద్భుతమని.. దాంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో విజయం సాధించగలడంటూ ప్రశంసలు కురిపించారు రవిశాస్త్రి.

2021లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియతో జరిగిన టెస్టులతో అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు అప్పటి నుంచి ఈ ఫార్మాట్‌లో పెద్దగా అవకాశాలు రాలేదు. ఇప్పటి వరకు 11 టెస్టులు ఆడి 545 పరుగులు చేయడంతో పాటు 30 వికెట్లు పడగొట్టాడు. సుందర్ రెడ్‌బాల్ మ్యాచులు మరిన్ని ఆడాల్సిందని.. ముఖ్యంగా భారత్‌లోని టర్నింగ్ పిచ్‌లపై ఆడించాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐసీసీ రివ్యూలో రవిశాస్త్రి మాట్లాడుతూ తనకు సుందర్ ఆట నచ్చుతుందని.. తొలిసారి అతన్ని చూసినప్పుడు అద్భుతమైన ఆటగాడని అనిపించింది, చాలా సంవత్సరాలు అత్యుత్తమ ఆల్‌రౌండ్‌గా మారే అవకాశం ఉందని తాను చెప్పానని గుర్తు చేశారు. ప్రస్తుతం అతని వయసు 25 సంవత్సరాలేనని.. భవిష్యత్ మరింత టెస్ట్ క్రికెట్ ఆడాల్సిందని తాను అనుకుంటున్నానన్నారు.

భారత్, న్యూజిలాండ్‌లాంటి టర్నింగ్ పిచ్‌లపై ప్రమాదకరంగా బౌలింగ్ చేస్తాడని.. కొందరు సీనియర్ స్పిన్నర్ల కంటే మెరుగ్గా రాణిస్తాడని.. అదే సమయంలో బ్యాటింగ్ కూడా బాగా చేస్తాడని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. న్యూజిలాండ్‌తో 2024 స్వదేశంలో నాలుగు టెస్టుల సిరీస్‌లోని నాలుగు ఇన్నింగ్స్‌లో 16 వికెట్లు తీశాడు. సుందర్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశంసించాడు. అతన్ని ముందుగానే బ్యాటింగ్‌కు పంపవచ్చని.. సహజంగానే ప్రతిభావంతుడని శాస్త్రి పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎనిమిదో నంబర్ బ్యాట్స్‌మన్ కాకుండా ఆరో నెంబర్‌లోనూ పరుగులు చేయగలడని రవిశాస్త్రి చెప్పుకొచ్చారు.

# నాలుగో టెస్టుకు ఆకాశ్ దూరం..

**సిరాజ్‌తో కొత్త బంతిని పంచుకునేది ఎవరు..?**

**న్యూఢిల్లీ:** అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కీలక మ్యాచ్‌కు ముందే భారత జట్టుకు వరుస షాక్‌లు తలుగుతున్నాయి. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లు ఒక్కొక్కరుగా గాయాల బారిన పడుతున్నారు. అనుకున్నట్టుగానే సిరీస్ విజేతను నిర్ణయించే ఓల్ట్ ట్రఫోర్డ్ టెస్టుకు పేసర్ ఆకాశ్ దీప్ దూరమయ్యాడు. గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న ఆకాశ్ నాలుగో టెస్టుకు అందుబాటులో ఉండడని మేనేజ్‌మెంట్ తెలిపింది. దాంతో సిరాజ్‌తో కలిసి కొత్త బంతిని పంచుకునేది ఎవరు? అనేది ఆసక్తికరంగా మారింది.

ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించాలనుకున్న భారత జట్టు లార్డ్స్‌లో అనూహ్య ఓటమితో సిరీస్‌లో వెనకబడింది. ఈ మ్యాచ్ పోయినా ఓల్ట్ ట్రఫోర్డ్‌లో పంజా విసిరి సిరీస్ సమం చేయాలనుకున్న గిల్ సేనకు జట్టు కూర్పు సమస్య తలెత్తింది. ఎవరిని ఆడించాలి? పేస్ దళంలో ఎవరికి చోటివ్వాలి? అనేది సవాల్‌గా మారింది. బర్మింగ్‌హమ్‌లో సంచలన స్పెల్(9 వికెట్ల)తో ఇంగ్లండ్ నడ్డివిరిచిన ఆకాశ్ గాయంతో ఆ మ్యాచ్‌లో బౌలింగ్ చేయలేదు. అతడి స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్‌ను ఆడిద్దామనుకుంటే అతడూ నెట్స్‌లో గాయపడ్డాడు.

స్క్వాడ్‌లోని ఇతరులపై ఆధారపడాలుకుంటే ఆ అవకాశం కూడా లేకపోయింది. పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి సైతం మోకాలి గాయంతో స్వదేశం రానున్నాడు. ఈ నేపథ్యంలో ప్రధాన అస్త్రం జస్ప్రీత్ బుమ్రాను తప్పక ఆడించాల్సిన పరిస్థితి. ఆకాశ్ అందుబాటులో లేకపోవడంతో సిరాజ్, బుమ్రాతో పాటు మూడో పేసర్‌గా ప్రసిధ్‌ను తీసుకోవాల్సి రావచ్చు. తొలి మ్యాచుల్లో విఫలమైన శార్దూల్ ఠాకూర్ కూడా నితీశ్ బదులు తుది జట్టులో ఉండే వీలుంది.




లార్డ్స్‌లో విజయంతో జోరు మీదున్న ప్రత్యర్థిని నిలువరించాలంటే సమిష్టిగా రాణించాల్సిందే. ఎందుకంటే ఓల్డ్ ట్రఫోర్డ్‌లో గత తొమ్మిది మ్యాచుల్లో ఒక్క విజయాన్ని రుచిచూడలేదు. టీమిండియా.. నాలుగింట ఇంగ్లండ్ గెలుపొందగా.. మరో ఐదు మ్యాచులు డ్రాగా ముగిశాయి. అయితే.. బర్మింగ్‌హమ్‌లో విక్టరీతో నవ చరిత్ర లిఖించిన గిల్ బృందం.. మరోసారి చెలరేగితే స్టోక్స్ టీమ్‌కు కష్టాలు తప్పవు. ఇరుజట్ల మధ్య బుధవారం (జూలై 23న) నాలుగో టెస్టు మొదలవ్వనుంది.



టాకీస్: హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీలో పవన్ సరసన హీరోయిన్‌గా శ్రీలీల నటిస్తున్నారు. అయితే, ఈ యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్టైనర్ లో తాజాగా రాశీ ఖన్నా జాయిన్ అయినట్లు మేకర్స్ ధ్రువీకరించారు. మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో ఆమె షూటింగ్‌లో జాయిన్ అయినట్లు ఒక పోస్టు పెట్టారు. ఇందులో ఆమె 'శ్లోక' అనే పాత్రలో నటిస్తున్నారని, ఆమెకు స్వాగతం అంటూ పోస్టు పెట్టారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' సెట్‌లో అడుగుపెట్టిన రాశీ ఖన్నా..

## మేకర్స్ ఆసక్తికర పోస్టు

కథాంశానికి కొత్తదనాన్ని తెచ్చే బలమైన, కీలకమైన పాత్రగా మేకర్స్ పేర్కొన్నారు. ఈ మూవీలో రాశి ఖన్నా శ్లోక అనే పాత్రలో ఫోటోగ్రఫీ జర్నలిస్టుగా కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ కొనసాగుతుందని సమాచారం. హీరో పవన్ కళ్యాణ్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్-హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇతర కీలక పాత్రల్లో ప్రతిబన్, కెఎస్ రవికుమార్, రాంకీ, నవాబ్ షా, అవినాష్ (కేజీఎఫ్ ఫేమ్), గౌతమి, నాగ మహేశ్ నటిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ఒక అసాధారణమైన శక్తి

'హరి హర వీరమల్లు'పై క్రిష్ జాగర్లమూడి ట్వీట్
ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతున్న 'హరి హర వీరమల్లు'
50 శాతం సినిమాకు దర్శకత్వం వహించిన క్రిష్
ఈ సినిమాకు పవన్ ఆత్మ, వెన్నెముక అని ట్వీట్
ఈ చిత్రం తనకు ప్రత్యేకమని వెల్లడి
సినిమా ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నానన్న క్రిష్



టాకీస్: ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు' ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. పవన్ కు తొలి పాన్ ఇండియా సినిమా ఇది. మొత్తం 5 భాషల్లో ఈ సినిమాను నిర్మించారు. ప్రముఖ సినీ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాను 50 శాతం పూర్తి చేసి.. ఆ తర్వాత ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత మిగిలిన సినిమాకు జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. మరో రెండు రోజుల్లో సినిమా విడుదల కాబోతున్న తరుణంలో... సోషల్ మీడియా వేదికగా క్రిష్ స్పందించారు.
'హరి హర వీరమల్లు' సరికొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమయిందని క్రిష్ అన్నారు. 'నిశ్శబ్దంగా కాదు... ఒక బలమైన సంకల్పంతో' రాబోతోందని చెప్పారు. సినిమాలోనే కాదు, ఆత్మలోనూ పవన్ కళ్యాణ్ ఒక అసాధారణమైన శక్తి అని కొనియాడారు. ఆయన నిత్యం మండే స్ఫూర్తి అని అన్నారు. ఈ సినిమాకు ఆయనే ఆత్మ, వెన్నెముక అని చెప్పారు. నిర్మాత ఏఎం రత్నం ఒక గొప్ప శిల్పి అని, ఎన్ని కఠిన పరిస్థితులు ఎదురైనా తట్టుకోగల ధైర్యం ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన గొప్ప సంకల్పం అందరికీ స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. వ్యక్తిగతంగా ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని అన్నారు. ఈ చిత్రం ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నానని చెప్పారు.

# అవతార్ 3 ఫస్ట్‌లుక్ విడుదల

టాకీస్: హాలీవుడ్ చిత్రం అవతార్‌కి ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.విజువల్ వండర్‌గా తెరకెక్కిన మూవీ ఎన్నో రికార్డులని చెరిపేసింది. ఇప్పటికే అవతార్ సిరీస్‌లో వచ్చిన రెండు భాగాలు ప్రేక్షకులని ఎంతగానో అలరించడమే కాక కోట్ల వసూళ్లు సాధించాయి. ఇప్పుడు మూడో పార్ట్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అవతార్ 3 మూవీ ఈ ఏడాది డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ శు క్రవారం వస్తున్న చిత్రంతో థియేటర్స్‌లో ట్రైలర్ ప్రదర్శించనున్నట్టు కన్ఫర్మ్ చేశారు. భారీ హాలీవుడ్ చిత్రం అయిన మార్వెల్ ఫెంటాస్టిక్ ఫోర్ మూవీతో కలిపి థియేటర్లలో ప్రదర్శించనున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో రెండింటిపైన ప్రేక్షకుల్లో ఆసక్తి భారీగా పెరిగింది. జేమ్స్ కెమెరూన్ తన సినిమా ప్రపంచాన్ని పంచభూతాల కాన్సెప్ట్ ఆధారంగా నిర్మిస్తున్నట్టు సమాచారం. మొదటి అవతార్‌లో 'భూమి', రెండో భాగంలో 'నీరు' (వాటర్) నేపథ్యంలో తెరకెక్కించగా, ఇప్పుడు మూడో పార్ట్‌లో 'నిప్పు' (ఫైర్) నేపథ్యంలో కథ సాగనుందని తెలుస్తోంది. ఈ కొత్త కథా కోణంతో పండోరా ప్రపంచం మరో అద్భుతంగా ప్రేక్షకులని అలరించనుంది. జేమ్స్ కెమెరూన్ అవతార్ ఫ్రాంచైజీకి ఇది చివరది కాదు ఇంకా పలు సీక్వెల్స్ సిద్ధమవుతున్నాయి
అవతార్ 4 .. 2029లో విడుదల కానుండగా, అవతార్ 5 లో 2031 లో రిలీజ్ కానుంది. ఈ భారీ ప్రాజెక్టులు ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. కెమెరూన్ ఇప్పటికే కొన్ని పార్ట్స్ షూట్ చేసినట్టు తెలుస్తోంది. డిసెంబర్ 19న అవతార్ 3 రిలీజ్ కానుండడంతో, ఆ నెల 15 తర్వాత రిలీజ్ కావాల్సిన భారతీయ సినిమాలు తమ తేదీలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. కెమెరూన్ సినిమా వస్తుందంటే దేశంలో పెద్ద పెద్ద ప్రాజెక్ట్స్ కూడా పక్కకు తప్పుకుంటాయి. జేమ్స్ కెమెరూన్ విజన్, వీఎఫ్ఎక్స్‌తో కూడిన అద్భుతమైన ప్రపంచం చూసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అవతార్ 3 ట్రైలర్‌తో ప్రారంభమయ్యే ఈ మాజికల్ జర్నీ, డిసెంబర్‌లో మరింత పీక్‌కు చేరనుంది.




## సన్ ఆఫ్ సర్దార్ 2..

# ట్రైలర్ విడుదల




టాకీస్: బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సన్ ఆఫ్ సర్దార్ 2. విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాల్ థాకుర్ కథానాయికగా నటించబోతుంది. రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన మర్యాద రామ సినిమాను హిందీలో సన్ ఆఫ్ సర్దార్ అని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే సినిమాకు సన్ ఆఫ్ సర్దార్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌తో పాటు ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను మొదటగా జూలై 25న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించిన చిత్రబృందం అనుకోని కారణాల వలన వారం వాయిదా వేసింది. దీంతో ఈ చిత్రం జూలై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త ట్రైలర్‌ను పంచుకుంది.

# జాలీగా షికారు..

టాకీస్: కన్నడ నుంచి తెలుగులోకి ఎంట్రీ ఇచ్చి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో ఒకరు రాయ్ లక్ష్మి. కాంచనమాల కేబుల్ టీవీ మూవీతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ ఫాలోవర్లను పెంచుకున్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుందని తెలిసిందే.

రాయ్ లక్ష్మి నెట్టింట ఫొటోలు పెట్టిందంటే చాలు లైకుల వర్షం కురుస్తుంది. ఎప్పుడూ నెట్టింట ఏదో ఒక అప్‌డేట్ షేర్ చేస్తూ తన ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. ఈ భామ తాజాగా బార్బీ డాళ్‌లా మారిపోయి న్యూయార్క్ వీధుల్లో షికారు చేసింది. బ్లాక్ అవుట్ ఫిట్ గ్రే హుడీ కాస్ట్యూమ్స్‌లో టైమ్స్ స్క్వేర్ వీధుల్లో తిరుగుతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. తాజా స్టైలిష్ మోడ్రన్ లుక్‌లో ఫ్యాషన్ ఐకాన్‌గా మారిపోయి కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రాయ్ లక్ష్మి ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తెలుగులో చివరగా వేర్ ఈజ్ దా వెంకటలక్ష్మి సినిమాతో ప్రేక్షకులను పలుకరించిన రాయ్ లక్ష్మి.. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలేమి ప్రకటించలేదు. మరి రాబోయే రోజుల్లో ఏదైనా సినిమా అనౌన్స్ చేస్తుందోమోనని ఎదురుచూస్తున్నారు అభిమానులు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.